# ఆడపిల్ల

చక్కెరాల వైదేహి

నా ఒకేఒకబిడ్డ నీరజ రేపు అత్త గారింటికి వెళ్తోంది. ఎంత విచిత్రం? పసిపాపగా పెంచి, ఎన లేని మమకారంతో పెద్దచేసి సర్వ హక్కులతో, ఆమెను వేరొకరిచేతిలో పెట్టవలసి వస్తూంది. నిన్నటివరకూ ఆ అమ్మాయిని గురించిన జాగ్రత్తలు, బాధ్యతలు నావి. అలాంటి నేను రేపటి నుంచి ఆ పాపను నా యింటికి తెచ్చు కోవాలంటే వేరొకరి అనుమతి కావాలి.

పాప అత్తగారింటికెళ్ళాక ఎన్ని బాధలో. అక్కడ కొత్త జీవితం. పెద్దదే అయినా, పాప ఇక్కడ నా గుండెలమీద పడుకొని, నా వీపున ఎక్కి ఆడుకుంది. ఇల్లంతా అల్లరి చేస్తూ చలాకీగా తిరిగింది. కానీ అక్కడ అలా జరగదు. వేసే ప్రతి అడుగులోను జాగ్రత్త అవసరం. ఇక్కడ ఒకవేళ తప్పుచేసినా, పొర పాటు చేసినా గట్టిగా మందలిస్తాను. మళ్ళీ పితృ మమకారంతో గుండె ల్లోకి తీసుకొని "తల్లీ! అలా చేయ కూడదమ్మా!" అని లాలిస్తాను. మన స్సుపల్లబరుస్తాను. కానీ అక్కడ అత్తగారు అలాకాదుగా? ఏదో తనకూ తన బిడ్డకు మధ్య వచ్చి అడ్డునిల్చిన పెద్ద పెనుభూతమని భావిస్తుంది. కసి తీరా హృదయం గాయపరుస్తుంది. మాటలతో, ఎంతకసిరినా తనకుతనివి తీరదు. ఇంకా అనలేక పోతున్నానే అని అసంతృప్తి పొందుతూంది. మనస్సు కుదిరితే భర్త ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవచ్చు. లేకపోతే చీద రించి దూరం చేయవచ్చు. అదంతా ఆడపిల్ల చేసుకున్న అదృష్టాన్నిబట్టి వుంటుంది. నా కన్నతల్లి పరిస్థితులెలా వుంటాయో.

రాత్రంతా పాపా, నేనూ మేల్కొనే వున్నాం. మా ఇద్దరి మధ్యగల గాఢ మైన ఆప్యాయతను ప్రదర్శించుకోను, ఒకరితో ఒకరంమనస్సుతీరామాట్లాడు కోను, మిగిలిపోయిన ఒకేఒక రాత్రి అది. రేపటినుంచి పాప "మాపాప" కాదు "పరాయిపిల్ల" ఈ మాట అను కున్నప్పుడల్లా నా కళ్ళలో నీళ్లు నిం డేవి. గుండెలలో మైనపువత్తి కరుగు తున్నట్టనిపించేది.

పాపకు ఎన్నో జాగ్రత్తలు చెప్పాను.

"పాపా! అక్కడ అందరితో జాగ్రత్తగా మసలుకోమ్మా! ఇక్క డిలా అల్లరి చేయకూడదు. మారాం పడకూడదు. "కోడలు" అంటే ఒక కొయ్యబొమ్మ. మనస్సులో కోరికలు కల్గినా మనస్సులోనే అణచుకో. అవి

తీరే అవకాశం వుంటుందని నమ్మకం కల్గితేగానీ. భర్తముందైనాసరే బయట పెట్టవద్దమ్మా! మీ అత్తగారు ఆడబిడ్డలు చూస్తూండగానే భర్తతో ఆప్యాయంగా మాట్లాడకమ్మా. ఈ మనుష్యుల మనస్తత్వాలు బహువిచిత్రమైనవి. మమకారం కొన్ని పరిస్థితులలో అసూయను సృష్టిస్తుంది. అసూయకు అనుబంధమైనది ద్వేషం. అన్నయ్య అనురాగానికి వేరొకతె వచ్చిందని, అందువల్ల అయన తమను మర్చిపోతాడని, తోడబుట్టినవాళ్ళ భయం. తన చేతులలో పెరిగిన బిడ్డ, తన చేతులలోకి వేరొకరిని తీసుకుంటూంటే సహించలేని తల్లిమమకారం. కొత్తకోడలు జీవితం కలగాపులగమైన సుఖదుఃఖాల అనుభవ సమ్మేళనం తల్లీ!

"కోడలు గుణగణాలను మెచ్చుకొనే అత్తగారు, లేడిపిల్లను ముద్దుపెట్టుకొనే పులి, కప్పను దయదలిచే పాము, సృష్టిలోనే వుండవమ్మా!"

"ఈ కొత్త జీవితానికి అలవాటు పడేవరకూ కష్టంగానే వుంటుంది. వాళ్ళేదైనా కసురుకున్నప్పుడు "మా నాన్న అయితే అలా అనేవాడా" అని వాపోవద్దు. కాలం ఎప్పుడూ ఒకలాగే వుండదు. పరిస్థితులు, పరిసరాలను బట్టి, ఆశలను, అభిరుచులనూ మార్చుకుంటూండాలి. ఒక్కొక్క చోట జీవితం కొన్నికొన్ని అనుభవ పాఠాలు నేర్పుతూంటుంది.

"ఇక్కడ సుకుమారంగా పెరిగినా అక్కడ అత్తమామల దగ్గర అణకువగా మెలగాలి. కష్టపడి పనిచేయాలి. ఇక్కడ ఇలా జరిగింది, అలా జరిగిందని పుట్టింటిని గురించి అత్తగారింట పొగడవద్దు. అది భర్త భరించలేడు."

"పుట్టిన వాళ్ళం పుట్టినట్లే పాపలుగానే కాలం గడపలేము. పెరిగి పెద్దవాళ్ళ మౌతాము. బాంధవ్యాలతోపాటు బాధ్యతలుగూడా మనలను పెనవేసుకపోతాయి. కాలంతోపాటు అన్నీ నీకే తెల్సివస్తాయిలేమ్మా! బాధపడకు" అన్నాను.

పాప నా ఒడిలో తలవాల్చుకొని ఏడుస్తూంది. పాపను మెల్లగా పైకి లేపాను.

"నాన్నా! నన్ను మర్చిపోవద్దు" అంది ఏడుపు మిళితమైన గొంతుతో.

నా చెంపలంతా బాగా తడిసిపోయాయి.

"పిచ్చితల్లీ! వాళ్ళ గుండెల విషయం వాళ్ళెప్పుడైనా మర్చిపోతారా?" అన్నాను. మబ్బులు కమ్మిన ఆకాశంలో ఒక్కసారి సూర్యుడు కనిపించి మాయమైనట్టు, నా ముఖంలో ఒక దరహాస రేఖ మెరిసింది.

తరువాత పాపలేచివెళ్ళి వాళ్ళమ్మ దగ్గర కాస్సేపు కూర్చుని, లేచి. భర్తవున్న గదిలోకివెళ్ళింది. ఆగదిలోనుంచి సన్నని నవ్వులు వినిపించాయి.



నా గుండె తేలికపడింది.

ఆ మరురోజు—

"వెళ్ళొస్తానాన్నా!" అంది పెద్దగా ఏడుస్తూ నీరజ. గుండెలనిండా దిగులు నిండిన నేను కళ్ళలోని నీళ్ళను కళ్ళలోనే వుంచుకుంటూ "పదమ్మా"

అన్నాను.

"అమ్మా!" అంటూ తల్లిని కౌగలించుకొని బావురుమంది.

"వెళ్ళిరామ్మా!" అంది వేదవతి కళ్ళు తుడుచుకుంటూ. ఆమె ఆవేదన హద్దులుదాటింది. కంటినుండి ధారావాహిని ప్రవహించ సాగింది.

అల్లుడు ముందు సూటుకేసుతో వెళ్ళి బండిలో కూర్చున్నాడు బండి దగ్గిరకెళ్ళి

"ఏంశంకర్, అమ్మాయిజాగ్రత్త!" అన్నాను, నా పిచ్చిగాని తన భార్యను తాను జాగ్రత్తగా చూసుకోకుండా పోతాడా?

"అలాగేలేండి! మీరు దిగులుపడకండి!" అన్నాడు ధీమాగా శంకర్.

తరువాత అమ్మాయి గూడా బండెక్కింది. బండి ముందుకు సాగి పోయింది. భారమైన మనస్సుతో వెళ్లి సోఫాలో వాలాను.

పడుకొని ఆలోచిస్తున్నాను. నా కెదురుగా వేదవతి కూర్చుని వుంది. ఆమెకు నీరజను దూరంగా వుంచడం అదే మొదటిసారి. పైగా మాకిక పిల్లలులేరు. అందుకే ఆ అమ్మాయిని అల్లారు ముద్దుగా పెంచాము. ఎంత ముద్దుగా పెంచినా ఒక రోజుకు ఒక అయ్యవెంట వెళ్ళవలసిందేగా ఆడపిల్ల?

అలా ఆలోచిస్తూండిన నాకు నా పెళ్ళి రోజులు, ఆనాటి అనుభవాలు, అనుభూతులు స్మృతి పథంలో మెదల సాగాయి.

వేదవతిని పెళ్లిచూపులలో చూచిన రోజే నా కెందుకో మా యిద్దరిదీ ఎప్పటి అనుబంధమోననిపించింది. అటు తరువాత రెండు నెలలకే మా పెళ్ళి జరిగిపోయింది.

అక్టోబర్ 11వ తేదీ నా పెళ్లి రోజు. ఆరోజు ఉదయం వేదవతిని వరపూజకోసం నా ముందు కూర్చోబెట్టారు. పెళ్ళి అంటే అదో వైభవం. ఆరోజు ముచ్చటైన దుస్తులతో ఇద్దరం అలంకృతమైయున్నాం. పెళ్ళి కూతురుగా వేదవతిని చూడాలన్న కుతూహలంకొద్దీ ఆమెకేసి చూశాను. నుదురున తీర్చిదిద్దినతిలకం, జడనిండా పూలు, మెడలో ఏదో హారం, చేతికి గడియారం, ఆకర్షణీయమైన రంగుగల్గిన పట్టుచీర, అదే రంగు రవిక, ఆమె తల వంచలేదు గానీ అర్థనిమీలితంగా కళ్ళు దించుకొని వుంది. ఆ ముగ్ధ మనోహర రూపం ఇంపుగా నా గుండెల్లో చిర స్మరణీయ రూపాన్ని చిత్రించివేసింది. అప్పటి వేదవతికి, నాకు పరిచయం ఏపాటీలేదు. ఇద్దరం ఒకరికొకరం కొత్త. ఒకరిలోని భావాలను ఒకరం చదవగల్గాలంటే ఒకరినొకరం గమనిస్తూ మాత్రమే. ఆమె సుతిమెత్తని వేళ్ళతో నా చేతికి గంధం పూసింది. నొసట కుంకుమ బొట్టు పెట్టింది. నేనూ అలాగే చేశాను. ఆమెస్పర్శతో ఏదో విద్యుత్ లత నా శరీరంలో

ఒక్కసారి ప్రవేశించి మాయమైంది. ఆమె చిటికిన వ్రేలు పట్టుకొని ఇద్దరం నడిచాము. నా చేయి కొద్దిగా కంపించింది. అయితే క్షణంలోనే నా శరీరాని కేదో వీడిపోని అనుబంధం అతికించి వేసినట్లయిపోయింది.

అటు తరువాత పెళ్ళి. హైందవ ఆచారం ప్రకారం పవిత్రమూర్తిఅయిన అగ్నిహోత్రుని ముందు పీటలమీద కూర్చున్నాం.

ఆ కార్యం నిర్విఘ్నంగా సాగాలనీ. కలియబోయే మా జీవితాలు కలకాలం కళకళలాడేందుకు ఇరువురం ఒకరికొకరం సహకరించాలనీ, ఒకరి చేతి కొకరం కంకణం కట్టుకున్నాం. కళ్ళలో పొగకమ్మి మంట. కళ్ళ నుండి నీళ్ళు కారుతున్నాయి. ఒక ప్రక్క పౌరోహితుని ఆజ్ఞలు. ఇంకొక ప్రక్క పెళ్ళికి హాజరౌతున్న స్నేహితులు, బంధువులను పరిశీలించడం.

పెద్దల సముఖంలో వేదవతి మెడలో తాళి కట్టాను. అంతవరకూ ఎవరో అయిన వేదవతి ఆ క్షణం నుంచి నా సర్వస్వం.

ఆ మరురోజు వేకువన "గంప వప్పచెప్పడం." అంటే అమ్మాయిని అబ్బాయికి వప్పగించేయడం. ఇద్దరికి మధుపర్కాలు కట్టి, కొంగు ముడులేశారు. మాకు వడికట్టారు. మేమిరువురం కలసి పెద్దలవద్ద కెళ్ళడం, వడిలో వక్కలు పోయించుకోవడం, సాష్టాంగపడడం,

వేదవతి తల్లివద్దకెళ్ళి అలాగే వంగి నమస్కరించాం. ఆమె పెద్దగా ఏడ్చింది. నా గుండెలు చెలువైనాయి. అవును మరి! తల్లి రక్తమాంసాలను పంచి, బిడ్డను పెంచి పెద్దచేస్తుంది. తాను తినకున్నా, బిడ్డకు పెట్టి సంతృప్తి పడుతుంది. అలాంటి తల్లి ఒక్కసారిగా తన బిడ్డను వేరొకరికి వప్పగించేయడమంటే మాటలా? అయితే అందులోనే ఒక విచిత్రముంది. అదే బిడ్డ వయస్సుకొచ్చినాక అవివాహితగా వాళ్ళ కళ్ళముందు తిరుగాడుతూంటే ఆ ఆవేదన అనన్య సామాన్యం. ఆ బిడ్డ బిడ్డకాదప్పుడు, గుండెలమీద కుంపటి.

ప్రతి తల్లి, తండ్రీ అనుభవించే తీపి బాధ అది. పెళ్ళి, సంసారం, పిల్లాపాప, సుఖసంతోషాలు, ఇలాంటి ఐహిక బంధాలతో జీవితం సాగిపోవాలని. అందుకు అనువైన పరిస్థితులు ప్రతి ఒక్కరు ఏర్పరుస్తారు. సృష్టిలోని ధర్మమది. ప్రకృతి ఎప్పుడూ పచ్చగానే కనిపిస్తుంది. అయితే, అందులో రాలిపోయే ఆకులు, వాలిపోయే చెట్లు ఎన్నో వున్నాయి. మానవ ప్రపంచమూ అంతే. ఏ తరానికాతరం క్రొత్త జీవనం. దానికి మూల సాధనమే పెళ్ళి. ఒక స్త్రీ, ఒక పురుషుడు బాంధవ్య బంధితులౌతారు. వారి మనుగడలో క్రొత్త సృష్టి ప్రారంభమౌతుంది. అదే

పెళ్ళియొక్క ప్రధానోద్దేశ్యం.

గృహప్రవేశ మహోత్సవం. మొదటిసారిగా దంపతులుగా మా ఇంట అడుగుపెట్టడం. ఇంటివద్దకొచ్చాక అంతవరకు మూగవాళ్ళుగా వుండిన మేము ఒకరితో ఒకరం మాట్లాడుకోవడం ప్రారంభించాము. నూతన వధూవరులు కలిసి మాట్లాడుకోవడం ఒకరకం విన్నూత్న అనుభూతి. గృహప్రవేశం మూడు రోజులు తెలియకుండా దొర్లిపోయాయి. నాలుగవ రోజు రాత్రి వేదవతిని వాళ్ళమ్మ, ఇతర ఇద్దరు ముగ్గురు బంధువులతో బస్సెక్కించవలసి వచ్చింది. అప్పట్లో వాళ్ళన్నయ్య నాగార్జునసాగర్‌లో పని చేస్తున్నాడు. ఆరోజు వేదవతిని విడిపోవలసి వస్తూంటే ఎన్నో సంవత్సరాలుగా కలిసి వుంటూ వచ్చిన ఆత్మీయురాలిని వదలిపెడుతూన్నంత బాధేసింది. బస్సెక్కించి భారమైన మనస్సుతో ఇంటికొచ్చాక, నా వ్యక్తిత్వం, నా మనస్సు, నా గతం అందులోని అనుభూతులు, అనుభవాలు వేదవతికి ఉత్తరంలో తెలియజేశాను. అంత స్వల్పకాల పరిచయంలోనే నేను నా భార్యకు అంత పెద్ద ఉత్తరం వ్రాయడం నాకే ఆశ్చర్యమేసింది.

అయిదు రోజుల తర్వాత నేను మా అమ్మతో నాగార్జునసాగర్ వెళ్ళాను. వాకిట అడుగు పెడుతూండగానె వేయికిరణాల ప్రభాసిత వదనయై నా కెదురొచ్చింది. కొత్త అల్లుడుగా నాకు జరిగిన అతిథి మర్యాదలు ఘనమైనవే. ఆ మరురోజే దీపావళి. నా జీవితంలో, నా చిన్నతనంలో ఎన్నో దీపావళులు జరిగాయి. గానీ అది నాకు దివ్య దీపావళి. నా జీవితంలో కొత్త వెలుగులు, కొత్త అందాలు ప్రదీప్తమైన దీపావళి. బావమరదులతో సరస సల్లాపాలు, భార్యతో రాసకేళీలు. ఆ రోజులు అలా సరదాగా దొర్లిపోయాయి.

నాగార్జునసాగర్ నిర్మాణం అత్యధిక వ్యయ ప్రయాసలతో జరుగుతున్న మహత్తర ప్రణాళిక. బీడువారిన ఎన్నో గ్రామాలను సశ్యశ్యామలంగా రూపొందించగల్గే కామధేనువు. కొండల నడుమ మెలికలు తిరుగుతూ శరవేగంతో ప్రవహించే కృష్ణానది పురవడికి అక్కడ ఆనకట్ట. ఆ డామ్ పరిసర ప్రాంతాలలోని సుందర ప్రకృతిలో మేమిద్దరమూ ఒక భాగంగా విహరించాము. అది పుష్కరాల సమయం. ఇద్దరం పుష్కర స్నానం చేసాం. సాయంత్రపు అరుణకాంతులలో ప్రభాసిల్లే కృష్ణమ్మ తల్లి అందాలతో ఆటలాడుకున్నాము. జంటగా కలిసి పొందుపర్చుకున్న ఆ అనుభూతులు జీవితంలో మర్చిపోలేనివి.

ఆ రోజు నాగార్జునసాగర్ నుండి బయలుదేరాం. ఆ రోజు నాకిప్పటికీ జ్ఞాపకముంది. ఏడుగంటల బస్సుకని

...యలు దేరాం. సూట్‌కేసుతో బయటి కొచ్చి నిల్చున్నాను నేను.

"అమ్మా! వెళ్ళొస్తా!" అని పెద్దగా ఏడ్చింది వేదవతి, వాళ్లమ్మను వాటేసుకొని.

అది కసాయివానివెంట వెళ్తున్న మేకపిల్ల ఆర్తనాదంలా అనిపించింది నాకు.

ఇలా ఇరవై సంవత్సరాలు కాల గర్భంలో కలసిపోయాయి. ఇరవై సంవత్సరాలలోను వివిధ తరహాలలో జీవితం పెరిగిన పరిణామం ఎంతో వుంది. ఇద్దరం ముగ్గురమయ్యాము. మా బాధ్యతగా అమ్మాయికి అనువైన సంబంధం చూసి పెళ్ళిచేశాము.

ఆ అమ్మాయి, ఆరోజు వాళమ్మ లాగె అత్తగారింటికి పోతూంది. అది యిక్కడ పుట్టినా అక్కడ పెరగవల సింది కాబట్టేనేమో "ఆడపిల్ల" అన్నారు.

"భోజనానికి లేవండి"? అంది వేదవతి నాభుజం పట్టుకొని వూపుతూ. వాస్తవ లోకంలోకి వచ్చిన నేను ఒక సారి వేదవతికేసి చూశాను.

"జీవితం గడించిన అనుభవాలు' ముఖాన్ని పులుముకొని, యౌవనం - వృద్ధాప్యమూ" సరిహద్దులలో నిలిచి వున్న వేదవతి. ఆనాటి వేదవతికి. ఈనాటి వేదవతికి పోలిక లేదు. ఆమెను చూచి మెల్లిగా నవ్వాను.

"ఏం? అలా నవ్వుతున్నారు?" అంది తనుగూడా నవ్వుతూ.

"ఏంలేదు. ఏదోగుర్తుకొచ్చింది" అంటూ భోజనానికి లేచాను.

ఇలా రెండు నెలలు గడచిపో యాయి. ఒకరోజు నీరజను యింటికి తీసుకొచ్చాను. వచ్చిన రోజంతా సర

అన్నిచోట్లకు ఏజంట్లుకావలెను
RUBBER STAMPS రబ్బరు స్టాంప్స
PRINTING BLOCKS ప్రింటింగ్ బ్లాక్స
HOARDINGS, CINESLIDES, హోర్డింగ్స, సినిమాస్లైడ్స
FLOWRSENT TINBOARS, ఫ్లోరసెంట్ టిన్‌బోర్డ్స
ఎస్.వి.యస్ S.V.S ANAND ARTS ఆనంద్ ఆర్ట్స

దాగా వుండినది కానీ ఆమరు రోజు నుంచి దిగాలు ముఖం వేసుకొని కూర్చుంది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కూర్చుని వుండేది. పాప వాడిన ముఖం చూచి నేను సహించలేకపోయాను.

"ఏం నీరజా! అలావున్నావు?" అని అడిగాను ఒకసారి వుండబట్టలేక:

"ఏంలేదు నాన్నా! వారికి నేను లేకపోతే క్షణమైనా తోచదు. నాకోసం బెంగ పెట్టుకుని కూర్చుని వుంటారు. నేవూరికి వెళతాను నాన్నా!" అంది. పాప అలా అనడంలో తప్పేమీ లేకపోయినా, నామనస్సుకు బాధ కలిగింది. ఇన్నాళ్ళు నా పాప. నా కోసం కలవరించే పాప. నన్ను మర్చిపోవద్దని కోరిన పాప. ఇప్పుడింకొకరి కోసం బెంగ పడుతూంది. నా దగ్గరే వుండికూడా నా చిట్టి తల్లి దిగులుగా వుంది.

ఆమరుసటి రోజే అల్లుడుగూడా వూరినుంచి వూడిపడ్డాడు. ఆయన్ను చూడగానే పాప ముఖం వికశించింది.

పాప అతని వెంట మళ్ళీ అత్తగారింటికి బండెక్కింది. అయితే ఈసారి దిగులు పడలేదు. సంతోషంగా వుంది.

"నాన్నా! మీరెప్పుడైనా ఒకసారి మాయింటికి రాకూడదూ!" అంది నవ్వుతూ.

నేను నాలోనే నవ్వుకున్నాను. నాపాప నన్ను వాళ్ళింటికి ఆహ్వానిస్తూంది.

అవును! తను "ఆడ-పిల్ల". భర్తతో జీవితం, కాపురం నిర్ణయించుకోవడం స్త్రీ ధర్మం. ఆ ధర్మం ముందు కన్నమమకారాలు గణనీయంకాదు.

వెళ్ళిపోతున్న నీరజ వాళ్ళ బండిని చూస్తూ నిల్చున్నానకు, నాబిడ్డ దూరమౌతోందన్న దిగులుతో పాటూ, "వారిది అన్యోన్య దాంపత్యంలే" అని మురిసి పోయాను.

"చూశారా" పాపపట్టుమని నాలుగు రోజులైనా వుండకుండా వెళ్ళి పోయింది" దిగులుగా అంది, నాప్రక్కన నిల్చున్న వాళ్ళమ్మ.

"అయితే! దానికి తన సంసారం మీద మక్కువ గాక, నీమీద నామీద ఎక్కడ చూపగలదే?" అన్నాను, నేను.

"అయితే మనకిక ఎవ్వరూ లేరా?" అడిగింది వేదవతి.

"లేకేం? నాకునీవు, నీకునేను వున్నాం. మన పాప ఇక ముందు మనింటి చుట్టం. ఇవంతా ఋణానుబంధాలు వేదవతి. ఎక్కడెక్కడో అనుబంధాలు, అల్లిక బిల్లికగా ఏర్పడి పోతుంటాయి" అంటూ వేదవతిని ఇంట్లోకి నడిపించాను, సూన్యమైన మనస్సుతో.

●●●